

# మాతృదేవి

[కథానిక]

●

= శ్రీ పుట్టి ఆంజనేయశర్మ =

"అమ్మా! దాదీ."

......................

"అబ్బా!...నర్సు...ఒక్కసారి"

ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో, పాలిపోయిన ముఖంమీద దట్టంగా పెరిగిన గడ్డంతో, నాలిక తడుపుకుంటూ పిలుస్తున్నాడు నెం 3 తె గదిలో వున్న రోగి. ముసలినర్సు మెల్లిగా ప్రక్కగదిలోని సోఫానుంచి తల ఎత్తింది. ఆ మౌనముద్రలో విపరీతతలపులు మెరుపుల్లా మెరిసి మాయమైవుంటాయి. ఆమెకు ఒకటే ఆలోచన: ఆ రోగి యెవరు? ఆ అభాగ్యుని అస్థిపంజరంలోనుంచి ఎటువంటి విషాదవిషయాలు స్ఫురణకు వస్తాయి? అత నెవరో తనకు తెలియదు. ఎన్నో వందలమంది వస్తూంటారు. ఎవరూ తన హృదయాన్ని ఇంతబలంగా ఆకర్షించి, తన శరీరాన్ని ఇలా కుదిపి, తన్నింత ఆరాటపెట్టలేదు. ఆమె మరిచిపోలేదు అతని కళ్ళని! ఎంత మంచి కళ్లు అతనివి! తను ఆ కళ్లని ఎప్పుడో చూసివుండాలి. కారు మబ్బులతో మలినమైన ఆకాశంలో మెరిసే జంటనక్షత్రాలు. ఆనందం కాని, ఆశకాని, తను విశేషించి ఫలానిదాన్ని ఆశించి అన్వేషిద్దామని గొప్ప చెప్పుకొనే జీవితం కాని తన కికముందు వుండదని ఆమె ఎప్పుడో నిశ్చయంచేసుకొంది. ఆ రోగిని ఎక్కడో పడివుంటే ఈ ఆస్పత్రిలో చేర్చి పోయారు దారినపోయే దానయ్యలు. అతను—అవును, బాగా జ్ఞాపకం—అతినీరసంగా, చేరడేసి మెరిసే కళ్లతో నావంక చూస్తూ "ఇంకా నేను చచ్చిపోలేదా?" అన్నాడు. చాలాసేపు పసిపిల్లాడిలా ఏడ్చాడు. తను విధ్యుక్తధర్మంగా ఆ అనాథున్ని లాలించింది. ఆ ప్రేమానుభూతివల్ల ప్రయోజనం లేకపోయినా.

"ఎందుకు ఏడుస్తావ్?"

"అంతకంటే నేను చెయ్యగల ఘనకార్యాన్ని ఊహించుకోలేకుండావున్నాను. అయితే, నన్ను ఏడవనివ్వరా?"

"వూరికే మనస్సు పాడుచేసుకోబోకు. సౌఖ్యం లేనంతమాత్రాన చావు కోరతావా? పిచ్చివాడా!"

"ఒకప్పుడు అందరూ ప్రేమించారు. కొంత కాలానికి ద్వేషించారు. నన్ను నేను గాఢంగా ప్రేమించుకున్నంతకాలం ఎవర్నీ లెఖ్ఖపెట్టలేదు"

"సరే, పడుకో"

"నన్ను మీరు మాట్లాడనియ్యాలి. లేకపోతే నేను వూరుకోను. ఈ గదిలో గోడలైనా కనీసం వింటాయికదూ!"

పాపం! అతన్ని చూస్తే జాలి, పరితాపం, సానుభూతీ తనలో మెదిలాయి. అందుకే అతని నంత హృదయంలో సన్నిహితునిగా చేసుకొంది.

"నువ్వంటే నాకు చాలా యిష్టం."

ఆ రోగికళ్ళు ఆనందజ్యోత్స్నలను వెదజల్లాయి. విషాదంగా, బరువుగా, పెద్దగా గది ప్రతిధ్వనించేటట్లు నవ్వాడు.

"నాకు చాలా బాధగా వుంది నవ్వంటుంటే. నన్ను చూస్తే నాకు రోతగా వుంది. నన్ను ఎవ్వరూ

ప్రేమించకూడదనే, నేనేదన్నా కోరడానికి వీలుంటే, వాంఛించేది!"

రోగి ఆయాసంగా కళ్లు మూశాడు. తను అప్పుడు వెళ్లిపోయింది.

ఆమె అప్పుడే అతని కళ్లతో తీవ్రంగా వేటాడబడింది. అవెప్పుడో తన కళ్ళల్లో ప్రతిబింబించి తన చెవులో "నాపిచ్చిసుందూ!"అని గట్టిగా ఘోషించి వుంటాయి.

* * * *

తడబడే అడుగులతో రోగిగదిలోకి మెల్లిగా నడిచింది. అతను కన్నులు మూసుకొని అమితాయాసంతో ఓవిధంగా వగర్చుతున్నాడు. ఆ స్థితిలో, ఆ జీర్ణవల్కలాల్లోని వ్యక్తిని చూసి, ఏమీ పరిచయం, సంబంధం లేని మనం చూపే సానుభూతికన్న ఎక్కువ సానుభూతి చూపింది. ఆ దీనవదనంలోంచి కారే కన్నీటిని మెల్లిగా అద్దింది. రెండు ఎత్తయిన పర్వతాలమధ్యని లోయల్లో ప్రవహించే నదుల్లా వున్నది ఆ పరితాపప్రవాహం!

మెల్లిగా "విశూ" కళ్లు తెరిచాడు. తనకే వినపడనంతటి హీనకంఠంతో "నేను • నిన్న చాలాసార్లు పిలిచాను. నామాటలు నీకు వినపడవుకదూ?"అన్నాడు. నర్సు ఒక్కసారి షాక్ తిన్నదానిలా కంపించింది. ఆమె గుండెల్లో ఎవ్వరో బలంగా కదిలిస్తున్నట్లనిపించింది. ఆ విపరీతపరితాపంలో ఎలాగో "కాదు" అనగలిగింది.

"నిన్న చాలాసార్లు వూరికే పిలుస్తుంటా..వూరికే"

"వూరికేనా?"

"నేను తూచి సమాధానంమాత్రం చెప్పలేని స్థితిలో వున్నాను. కాని నువ్వు నామాట వినాలని నేను అర్థించడంలేదు. తిరస్కరించడానికి సంపూర్ణ హక్కు వుంది. కాని నే నడగలేకుండా వున్నంత హృదయదౌర్బల్యస్థితిలో వున్నందుకు క్షమిస్తావని ఆశిస్తాను."

.....................

"నాకు తెలుసు, నీకూ తెలుసు. నేను చాలా కొద్దికాలంమాత్రమే జీవిస్తాను."

ఆమె శ్రమన్పడి వింటోంది. ఆ మెరిసే కళ్లు ఎప్పుడో తన్ను అతిసన్నిహితంగా పలకరించి, తన్ను ఎలాగైతేనేం, విపరీతఉద్రేకంలో ఊపినాయ్!

"నాకు నీ దగ్గరికి రావటం ఇష్టం."

బలహీనంగా నవ్వాడు.

ఇద్దరూ మౌనంగా చూసుకున్నారు.

గడియారం గట్టిగా రెండుకొట్టి ఆ నిశ్శబ్దాన్ని చీల్చింది.

"నేను పోతున్నా."

"ఎందుకు? ఎవరికోసం?"

"ఎంత అమాయకంగా అడుగుతాడు" అనుకొంది ఆమె. తనకోసమేనా నేనుందీ!!

"చూడు, నీలాంటివారిని చాలామందిని చూడాలి."

"చాలామంది ఉన్నా రనుకుంటా చూడ్డానికి; పొరపాటే."

"నీ కేం కావాలి చెప్పు?"

"ఇలా నన్ను చూస్తూ కూర్చో. నేను మహాకవి రాజాస్థానంలో నర్తకిని వర్ణించినట్లు ఊహాపథంలో వర్ణిస్తా. నువ్వు ఇక్కడికి రావాల్సినదానివి కావు. చూడు—నీ పేరేమిటో!—ఇలా నా వంక నింపాదిగా నవ్వుతూ చూడు! ఎక్కడినుంచీ వచ్చింది ఆ కోమలత్వం? విను. నువ్వో గంధర్వకన్యవిసుమా!"

"అబ్బ, చాల్లే!"

"కాసేపు మాట్లాడబోకు. నిన్ను మాట్లాడనీను. పగలంతా చెమటోడ్చి పున్నమరాత్రి చంద్రుణ్ణి చూసే కలలుకని, కష్టాన్ని మరిచే కార్మికవీరుణ్ణి నేను. నిజం చెప్పు: నువ్వు దేవతవా?"

"నన్నెందు కిలా వుడికిస్తావు? ఏమిటో, నీ ప్రతిమాటా నాలో ఇంత పరివర్తనాన్ని ఎందుకు తీసుకురావాలో నాకు తెలీదు. కాని తెలుసుకోవాలని చాలా ఆశగా వుంది."

"అవును. ఇద్దరం ఒక్కస్థితిలో వున్నాం."

"ఏదన్నా కథ చెప్పనా!"

"నాకు అది ఆనందాన్ని కాని, బాధనికాని ఉపశమిస్తుం దనుకోను. మా అమ్మ కథలు చెప్పకపోతే ఏడ్చి ఏడ్చి నిద్రపోని రోజుల్ని చూసి చాలా ఆశ్చర్యపడుతుంటా. అవును. అప్పుడు చిన్నవాణ్ణి. కల్మషంలేని హృదయం. కల్పవృక్షంవంటి కన్నతల్లి! నువ్వేన్నన్నా చెప్పు. తల్లికంటె ప్రపంచంలో మానవుడు అరాధించ

వలసిన దైవం లేదు. అందుట్లో ఓ భారతహైందవస్త్రీ మాత స్థితి ఎంత విషాదస్థితిలో వుందో నీకు తెలుసు."

............

"అవునా !"

నర్సు విషాదంగా నవ్వింది. "అయితే నువ్వేదన్నా చెప్పు"

"నేను చాలా చెప్పదలచుకొన్నాను. కాని ఏదీ ప్రయత్నపూర్వకంగా చెప్పటంలేదు. ఇది నీకో కథగా తోచినా ఇబ్బందిలేదు."

"ఎందుకూ ?"

"ఏమీ లేదు. కథలన్నా జీవితప్రతిబింబాలే. ఇవ్వాళ నువ్వు చదువుతూ కథలని త్రోసిపుచ్చే వన్నీ ఒకప్పుడు జరిగినవే. చాలా కథలు ప్రపంచానికి తెలియకపోవచ్చు."

"అయితే చెప్పు. నాకు చాలా సంతోషం"

"చెప్పనా!" రోగి సంతృప్తిగా,హృదయపూర్వకంగా నవ్వాడు!

*   *   *   *

" ఆ అరుపులు, ఆ కోలాహలం, పరిగెత్తడం పిచ్చి కేకలు—ఎవరూ ?" అన్నాడు విశు నింపాదిగా ప్రక్క మీద కూర్చుంటూ.

"ఇవ్వాళ క్రొత్తేమిటి ?"

"వచ్చినప్పటినుంచీ రోజూ సాయంకాలం ఈకిటికీలోంచి చూస్తున్నా. దూరంగా ఆ ముసలామె చుట్టూ పిల్లలు చేరి ఒక శేగోల. ఎవరామె? పాపం" జాలిగా నిట్టూర్చాడు.

"ఆమె..." మెల్లిగా అంది ఆమె. "అవును, ఆమె-నీకూ నాకూ ప్రపంచానికీ ఆమె ఉపయోగపడే స్థితిలోగాని, అర్థంచేసికొని సానుభూతిచూపేస్థితిలోగాని లేదు."

"ఆమె పిచ్చిదికదూ ?"

"ఆమెకి ఆనందం ఏదన్నావుంటే ఇప్పుడే. ఎందుకంటే ప్రపంచం ఆవిడకి పిచ్చిలేదన్నంతకాలం ఆమెజీవితయాత్ర నరకయాత్ర అయింది. ఆవిణ్ని చూస్తే నీకు జాలివేయటంలేదూ ?"

"ఆ సంగతి నన్నడగబోకు. నాహృదయం మండిపోతూంది. గత విషాదస్మృతులు నన్ను కలిచివేస్తాయ్. ఎవరామాతృమూర్తి ?"

"ఎందుకు అదంతా !"

"ఎందుకో చెప్పలేను. ఒక సానుభూతిపరుడికి చెప్పటంలో నీకేం అభ్యంతరం వుంటుందో ఊహించలేకున్నాను."

"ఆమె అంటే నాకు విశేషపరితాపం. రోజూ నాదగ్గరికి పొద్దున్నే వచ్చి పలకరించిపోయేది! కొన్నాళ్లు సాయంత్రంకూడా వస్తుండేది. ఆమెకు చెప్పుకునేవారెవ్వరూ లేరు. జాలితలచి వాళ్లూ వీళ్లూ ఏమన్నాయిస్తే తింటుంది. ఏపంచనో పడుకొంటుంది."

"ఎవ్వరూ లేరా ఆమెకు ! నీతో ఏం మాట్లాడేది ?"

"ఓరోజు మా యింటికి తీసుకు పోయి ఎక్కడికీ తిరగక, యిక్కడే తింటూ పడుకోమన్నాను. రెండు రోజు లలా వుండి, మూడోరోజున మళ్లీ మామూలే. ఎక్కడికో లేచిపోయింది"

"నిన్నేం అడుగుతుంది రోజూ?"

"ఒక్కటే ప్రశ్న. దానికి విధి విరామం లేదు. బహుశా ఆమె జీవితపర్యంతరం అడుపడే ప్రతి సానుభూతిపరుడి కర్ణపుటాల్లోను భీకరంగా బాధగా ప్రతిధ్వనింపజేస్తూనేవుంటుంది. "మాఅబ్బాయి మీ కెక్కడైనా అగుపడ్డాడా?ఓసారి నాదగ్గరకి రమ్మని చెప్పండి. ఏం, చెబుతారు కదూ?" అంటుంది." విశూ ప్రబలంగా వణికిపోయాడు. అలాగే అంటుందామె :

"అందరూ విషాదంతో తలవంచుకుంటారు. ఆ త్యాగమూర్తిమాతృప్రేమకు ! 'ఏం, చెబుతారుకదూ?' అంటే ఏమంటారు చెప్పు ? ఎవరైనా!"

*   *   *   *   *

ఆమెకు నమ్మకం—ఎప్పుడన్నా, ఎవరన్నా, ఎక్కడన్నా తన కొడుకుసంగతి తెలియజేస్తారని ! ఆ నమ్మకంమీదే జీవించివుంది. ఆ ఉన్మాదమే ఆమెకు ఆనందం. లేకపోతే ఇన్నాళ్లు జీవించదేమో!

విశూ తువ్వాలుతో ముఖం కప్పుకున్నాడు.

"ఎందుకు అలా వెక్కివెక్కి ఏడుస్తున్నావ్?"

"ఏమీ లేదు."

"ఏమీ లేదా ?"

..............

"పోనీ,బాధ కల్గిస్తే చెప్పనులే."

"నామీద వొట్టు ; నామనశ్శాంతిని చెడగొట్టబోకు."

"మరి దుఃఖించబోక."

"కన్నీరుకారితే వచ్చిన నష్టం లేదు! అవి బాధను ఉపశమింప జేస్తయ్యని నా నమ్మకం. మానసిక భావదర్పణమే కన్నీరు!"

*   *   *   *   *

"నర్సు...మా కోడలేదీ?"

"ఎవరో పిలుస్తున్నారు!"

"ఆఁ, ఆమె, ఒకసారి మాట్లాడి పంపించివస్తా" మెరుపుతీగలా నర్సు మాయమయ్యింది. శూన్యంగా ఆమెఅడుగుజాడల్ని చూస్తూ గాఢంగా నిట్టూర్చాడు విశూ.

విశూ నర్సుకోసం ఆరోజు చాలాసేపు చూశాడు గాని ఆమెజాడ అగుపడలేదు. మర్నాడు మామూలుగా టెంపరేచర్ చూడ్డానికి వచ్చినప్పుడు చాలా ఆత్రుతతో అడిగాడు: "ఆమెవిషయం దయచేసి చెబుతారూ? రాత్రంతా ప్రక్కంతా కన్నీటితో తడిసిపోయింది. నా మీద సానుభూతి ఈ విషయంలో చూపండి"

ఆమె ఈ విషయాన్నిగురించి అతడింత పట్టు బడతాడనుకోలేదు. మెల్లిగా తల పంకించి, తలుపు మూసి ఆమె మౌనంగా కూర్చుంది.

"నా గతించిపోయిన జీవితఘట్టాల్ని పునస్మరిస్తున్నాను. కొంతవరకు ఆత్మానందం నాకు లేకపోలేదు.

ఆమెజీవితం, నా జీవితం దృఢంగా పెనవేసుకోటానికి కారణం విచిత్రమైందే!

ఆమె ఆగర్భశ్రీమంతురాలు. తండ్రి మూడో పెళ్లి చేసుకున్నతర్వాత ఆమెనుగురించి శ్రద్ధతీసుకోలేదు. ఏదో పెళ్లి అయిందనిపించడానికి దారినపోయే ఓ దానయ్యకిచ్చి పెళ్లిచేశాడు.

సమర్థతకాని, నడవడికాని లేని ఆ భర్తచేతుల్లో ఆమె నేసారిపోయింది. అతను పోయినా, ఆమెజీవితాంతం తనవంతు సాధించడాని కన్నట్లు ఒక కొడుకుని ప్రసాదించిపోయాడు.

స్త్రీ! అందుట్లో బీదరాలు! ఆ వయస్సులో, సంఘం అన్నివిధాలా లోపాలు కనిపెట్టాలని ప్రయత్నించే విషమసమయం—చచ్చిపోదామన్నా అడ్డొచ్చే రక్తసంబంధం...తన కొడుకు! ఏం చేస్తుంది? కన్నవారింటి తాలూకు సవతిఅన్నదమ్ములు తిరస్కరించి, నీచంగా మాట్లాడారు. తనవాడని చెప్పుకుందామన్న తండ్రికూడా ఆమెకు లేడు. నిశ్చింతగా చచ్చిపోయాడు.

ఆమె నాకు చాలాసార్లు చెప్పింది: తనకు జీవితంలో ఒకటే ఆశట! తన పిల్లవాడు పెద్దవాడయి, గౌరవనీయంగా సంపాదిస్తూ, గొప్పవాడని పేరు పొందితే, తను ఆనందబాష్పాలు రాలుస్తూ, మహారాణిలా జీవిస్తుందట. ఎవ్వరితో చెప్పినా తన కొడుకుని గురించే మాట్లాడుతుందిట.

ఏ ఆశాసౌధాలు ఆమె ఊహాపథంలో నిర్మించుకుందో, వాటికోసమే ఆమె తనకున్న గౌరవాన్ని, శక్తిని, తనదని చెప్పుకున్న ప్రతిదానిని విసర్జించింది. గౌరవనీయమైన వంశం. ఆమె అన్నీ మరిచిపోయింది. పున్న మహారాజుల ఇళ్లల్లో ఆమె వంటపూటితనానికి కూడా వప్పుకొంది. ఎంత శ్రమపడినా, ఎంతమంది వేలుపెట్టి చూపినా ఆమె శాంతమూర్తియై నిలిచింది. తన పాపను హృదయానికి హత్తుకుంటే అదే ఆమెకు స్వర్గసీమ! ఆ సీమలో ఓ మాతృదేవి-ప్రపంచాన్నెరుగని ఓ అమాయక ముగ్ధబాలుడు మాత్రమే గోచరిస్తారు ఆమెకు!

క్రమంగా కొడుకు బాల్యావస్థని సుఖకరంగానే ముగింపజేసింది. అతనుకూడా బుద్ధిమంతుడు. సక్రమంగా పరీక్షలన్నీ నెగ్గుతూవచ్చాడు.

అతను పట్టభద్రుడైనతర్వాత న్యాయవాదవ్వాలనుకొంది ఆమె. అతనూ సమ్మతించాడు. సానుభూతి చూపే కొందరు గౌరవనీయుల సాయంతో, విద్యార్థివేతనాలతో అతను లాకాలేజిలో చేరాడు. అతికష్టంమీద కాలం గడుపుతూవుండేవాడు.

అతన్నిరోజూ చూస్తూండేదాన్ని. బీదవాడవటంచేత మేమంతా నివసించే సానివాడలోనే ఓ చిన్న గది అద్దెకు తీసుకొన్నాడు. అతనికి ఏ దురభ్యాసమూ, నేనెరిగున్నంతవరకు, అప్పట్లో లేదు. ఆజానుబాహువు, కండలుతిరిగిన శరీరం, నల్లటి ఉంగరాలజుట్టు, పరిశీలనగా చూసే నేత్రద్వయం—ఎంత బాగుండేవాడు! చెబుతుంటే ఇప్పటికీ నేను వివశనైపోతాను.

అతనితోటి చదివే సాటివిద్యార్థులంతా మా ఇళ్లకి వస్తూండేవారు. తల్లిదండ్రులు పంపే ధనాన్ని, వాళ్లకి తెలియకుండా, తమ ఆత్మల్ని వంచించుకుంటూ, వ్యభిచారాన్ని అణచలేని ఓ ప్రచండశక్తిగా నిరూపించడానికి ప్రయత్నించేసేవారు.

నా సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఈ పతిత భారతదేశంలో, దమ్ముల్లేని, నీరసించిన పిరికిపురుషుల కౌగిళ్ల వల్ల కృశించి, నశించిపోయింది నా శరీరం. నే నావృత్తిని హృదయపూర్వకంగా ఎన్నడూ వాంఛించ లేదు. మా కుల పెద్దలు, సంఘ పెద్దలు 'సాంప్రదాయం, అందుట్లో దోషం లే'దన్నారు. వారి బాధ తీర్చుకోవ డానికి 'కులవృత్తి' అనే గౌరవపదం చాలు అడ్డం పెట్టు కోడానికి. ఇప్పుడిక్కడ నా శీలాన్ని గురించి అతి శయోక్తులు చెప్పనవసరం లేదు. దానివల్ల నాకు కలిగే లాభం ఏమీ లేదుకనుక. మాతండ్రి, తల్లి, బంధువులు అంతా నిర్బంధించారు. తర్వాత చలనం, ఆనందం లేని నా శరీరంలో దురాశ, ప్రతీకారం పుట్టుకొచ్చాయి! ఈమగపురుషుల్లోకి విషం ఎక్కించి, వాళ్లని వంశపారం పర్యంగా నాశనం చెయ్యాలనుకున్నాను.

ఆకాలంలో నేను అందంలో పేరుమోసిన వేశ్యనని పేరుపొందాను. పట్టుదలతో నా ప్రాపు పొంద టానికి కులవిచక్షణ లేకుండా డబ్బుని చాలామంది విచ్చలవిడిగా వెదజల్లారు.

కాని, నావంకైనా నింపాదిగా చూడని అత నంటే నాకు చాలా కోపం. ఆ యువక ప్రవరాఖ్యు డంటే నాకు రోమాంచం కలుగుతుంది. ఆ నడకలో ప్రపంచాన్ని జయించగలననే ధైర్యం! ఎవ రావీరుడు!

ఓసారి మావీథిగుండా వస్తుంటే నా తమ్ముణ్ణి పంపించాను ఎలాగైనా ఆయ న్నిక్కడికి తీసుకొస్తే గొప్ప బహుమాన మిస్తానని. కనీసం వూరికేనన్నా వచ్చి, కాస్త పానీయం పుచ్చుకుపొండిఅని అన్నా చెప్పి తీసుకురమ్మన్నాను. మొదటిరోజు బిక్క మొహంతో వచ్చాడు వాడు.

మర్నాడు వాడికి క్రితంరోజల్లే చెప్పవలసిన కిటుకులన్నీ చెప్పి, తీసుకురాకపోతే తిరిగి ఇంటికి రావద్దని గట్టిగా మందలించాను.

ఆత్రుతగా మావాడు అతనితో మాట్లాడ్డం, అదీను. గుండెలు వేగంగా కొట్టుకుంటుంటే దేహం చల్లబడిపోయింది.

ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు.

గుండె గట్టిగా అదుముకుంటూ ఆవంక చూశాను. పర్వతరాజులాగా గంభీరంగా అతనూ, మేకపిల్లలాగా తమ్ముడూ మా ఇంటివైపు వస్తున్నారు. నేను మెల్లిగా లోపలికి వెళ్లి అద్దంలో నా అందాన్ని సవరించుకొని, కుర్చీలో కూర్చొని ఏదో పుస్తకం తిరగేస్తున్నాను.

అడుగుల చప్పుడు గాఢంగా వినిపిస్తోంటే లేచి "స్వాగతం, సుస్వాగతం, రండి" అన్నాను. కాళ్లు కడుక్కోటానికి సుగంధపు నీళ్లు అందిచ్చాను. అలంక రించివున్న ఆగదిలోకి ఆహ్వానించాను. అతను పరిశీ లనగానే చూస్తున్నాడు. ఆ గంభీరవదనం ఏమీ చలించలేదు. ఇద్దరం మౌనం వహించాం. ఆమౌనం నన్ను దహిస్తోంది! చాలాసేపటికి ప్రకంపించే కంఠంతో అన్నాడు—"ఇక్కడికి నే నెందుకు ఆహ్వానింప బడ్డానో నాకు సరిగా తెలీదు. కారణం కొంచెం చెబుతారూ?" నే నాప్రశ్న, అంత నిర్దయగా, ఆ మార్దవకంఠంలోనుంచి వస్తుం దనుకోలేదు. నేను తల క్రిందవవలసివచ్చిన ఘటన అది!

మాట్లాడలేదు. అసలు మాట్లాడదలచుకోలేదు. అయినా ఏం మాట్లాడను! "నాలో ప్రత్యేకత ఏదన్నా మిమ్మల్ని ఆకర్షించిందేమోనన్న సంశయం నన్ను బాధిస్తోంది. నాకు ఎవరన్నా నాకు తెలియ కుండా విలువయిస్తుంటే నేను బాధ్యుణ్ణి కాదు."

"నేను చెప్పదలచుకొంది విపులీకరించడం మంచిది ఎందుకైనా! నన్ను మీ రేదృష్టితో చూస్తు న్నారో ఆదృష్టికి నేను బాధ్యుణ్ణి కాదు! అయినా మీ రీవిషయంలో బలహీనత కనపరిచినా అడ్డుపెట్ట డానికి నేను అర్హుణ్ణి కాదు."

నేను మౌనం వహించడంలో ఇంక అర్థంలే దనుకున్నాను. "నేనేదృష్టితో మిమ్మల్ని చూస్తున్నానో అ దేమంత, మీదృష్టిలో గాని, చాలామందిదృష్టిలో గాని గౌరవంకలది కాకపోవచ్చును. నాబలహీనతకు క్షమించినందుకు మీకు చాలా కృతజ్ఞురాల్ని."

అతను ఓసారి తలెత్తి చూశాడు పరిశీలనగా. ఆచూపులో ఆశ్చర్యం, సానుభూతీ స్పష్టంగా గోచ రించాయి.

"ఈమాత్రం వచ్చి నేను మిమ్మల్ని ఏమన్నా సంతృప్తిపరిచివుంటే తృప్తిపడతాను... నేను వెళ్లి పోదలచుకున్నాను"

నేను పాకతిన్న శరీరంలాగా బాధపడ్డాను. అయినా ఆత్మాభిమానంతోనే "మీరు వెళ్లిపోతానని దృఢంగా చెబుతున్నప్పుడు బలవంతపరిచి ప్రయోజనం లేదు. కాని నేనిచ్చే ఈ అల్పఅతిథిసత్కారాన్ని ఓ నూతనపరిచితుడిగా స్వీకరించాలని ప్రార్థిస్తాను."

నేను అర్పించిన మధురఫలాల్నిగాని, ఫలహా రాల్నిగాని, పానీయాల్నిగాని అతను ఏమీ ముట్టుకో లేదు. మంచినీళ్లుమాత్రం తాగాడు.

"నమస్తే. నాకిదే తృప్తి"

"నా ప్రార్థన ఒకటి మన్నించండి"—అతిదీనంగా వేడుకొన్నాను.

"ఏమిటి ?" అన్నాడు ఆత్రుతగా, ఆశ్చర్యంగా.

"మీరు తీరిక దొరికిన సమయాల్లో, ప్రపంచం బాధగా అగుపించిన సమయాల్లో, నాకు సాధ్యమైనంత సాయంచేస్తాను-దయచేసి స్వీకరించండి. మళ్లీ వస్తారు కదూ ?"...కాసేపు ఆలోచించాడు.

"దీంట్లో అభ్యంతర పెట్టాల్సింది నేనున్న పరిస్థితిలో ఏమీ లేదు. కాని ప్రపంచంలో అర్థించినా, అవస్థపడినా ఎవరూ నా వంక చూడలేదు. కాని మీరు వాళ్లకంటే చాలా ఉత్తమోత్తములని నాఅభిప్రాయం. నమస్తే."

శరవేగంతో వెళ్లిపోయాడు. ఆ మెఱుపుతీగ! గట్టిగా వేడినిట్టూర్పు విడిచాను కొంత ఊహించుకున్న తృప్తితో !

*　　*　　*

"అతను వెళ్లిపోయాడు. ఆ నడకలో ఎంత రాజసం! ఎంతఠీవి" ఈ ఊహలతో తీవ్రంగా చాలా రోజులు వేసారిపోయాను. ఆ దివ్యలావణ్యమూర్తి నేను కలలుకనడానికేనా నా మనఃపథంలో మెరిసింది! ఎందుకు నా యౌవనం, నా రూపం, నా భాగ్య సంపదలు! సంతృప్తిలేని జీవితానికి ఇవన్నీ తృణప్రాయాలనుకున్నాను. తమ్ముణ్ణి చాలాసార్లు పొమ్మన్నాను. వాడు కొన్నిసారు పోయీ, మరికొన్నిసార్లు పోయినా వని చెప్పీ, మొత్తానికి ఒకటే కర్ణకఠోరమైన సమాధానం చెప్పేవాడు. అవును. నాలో వేదనని వాడు గుర్తించుకోలేడు. అంతెందుకు, నేను ప్రేమించగలనని హృదయపూర్వకంగా ఎవ్వరూ నమ్మరు! నేను కాచుకుని కాచుకుని కళ్లు కాయలుకాచిపోయాయి. నారాజు రాడు! నేను విపరీతంగా పరితాపపడ్డాను. నేను వేశ్యను. నా మాట నమ్మరు. ప్రజలు గౌరవించే స్థితిలోకి నేను ఎప్పుడూ రానని తెలుసు. మళ్లీ ప్రజలే చాటుగా నన్ను అర్థించి, స్వార్థంగా, సత్యాదర్శానికి దూరమౌతారు.

నేను వేశ్యనవటానికి కారణం ? అమ్మానాన్నా వాళ్లు నిర్బంధించబట్టేనా! వాళ్లు నిర్బంధించటానికి కారణం ? దారిద్ర్యమా ? కళంకంటే దారిద్ర్యం ఎక్కువా ? దారిద్ర్యాన్ని ముఖ్యకారణంగా భావించడానికి వీలులేదు. ఎంచేతంటే మేము కట్టుబట్టలకూ, తిండితిప్పలకూ తీసిపోయినవారం ఏ విధంగాచూసినా కాము! ఏమయినా అవనీ, నేను వేశ్యను! ఎందుకీతర్కం ?, ఎందుకీబాధ, పరితాపం ?? తీరని మనోవేదన!!! ఓ విధంగా చాలామంది హిందూస్త్రీలకంటే, భర్తలులేనివారికంటే చాలా స్వతంత్రంగానే వున్నాను. నన్ను ఎవ్వరూ శాసించటానికి వీలులేదు. నేను చాలామందిని తిరస్కరించగలను. బుజ్జగింపబడగలను. కాకపోతే, ముందుజన్మలో ఏమైనాగాని! కళ్లముందర నేను చూడని, అనుభవించని కష్టసుఖాల్లో, అందుట్లో చచ్చిపోయింతర్వాత, ఏమైనా ఫరవాలేదు!

నా ఆత్మసంతృప్తికోసం ఏదో సమాధానపరుచుకో ప్రయత్నించేదాన్ని"

"అతను రాలేదా ?" విశూ చాలా ఆత్రుతగా అడిగాడు.

ఆ ముసలినర్సు కళ్లల్లోని లోతైన సముద్రాలు సగర్వంగా పొంగినాయి!

"రాకుండాపోలేదు. మా ఇద్దరికీ..."ఆమె ఛటుక్కున ఆగిపోయింది. చాలాసేపటికిగాని ఆమె తేరుకోలేదు.

"విను,ఏమైందనుకున్నావ్ ?" అంది విషాదంగా.

విశూ మహోన్నతుడైన గురుదేవుని పాదాల ముందు శిష్యుడు వినయంగా కూర్చున్నటు కూర్చున్నాడు. అలసట, అలుపు మరిచి అతనిలో అంత నమ్రత్వం ఎలా వచ్చిందో !

డాక్టరు కిటికీలోంచి చూశాడు ఇద్దర్నీ. రోగి ముఖంలో ఆయన చాలా మార్పు కనిపెట్టాడు. ఆ నిశ్శబ్దం మూర్తీభవించిన గదిలో వారిద్దరే ప్రపంచం అనుకున్నట్లు కూర్చున్నారు పరవశత్వంలో !

కాసేపు చూసి డాక్టరు పరీక్షించకుండా పోయినాడు, తృప్తితో.

"నేను చాలా నిరాశ చేసుకున్నప్పుడు, వస్తాడని ఎన్నడూ అనుకోనప్పుడు అతను ఆదరాబాదరాగా ఓ రాత్రి వచ్చి తలుపుగొట్టాడు. నేను వెంట ఎవరోననుకొని "ఇప్పుడు వీలులేదు."అని నిద్రమత్తులో అన్నాను విసుగ్గా.

కాని, ఆ గంభీరనినాదం నా మత్తును వదలగొట్టింది. నా స్వామి తన భక్తురాల్ని రక్షించడానికి

వచ్చాడు. నేను ఆశ్చర్యఆనందాలతో అతన్ని వేయి ప్రశ్నలడిగాను. మధురంగా స్వేచ్ఛాగానం చేశాను. ఎంత నిబ్బరం కనపరిచాడు! ఏమీ తొణకలేదు. మొత్తంమీద అతని ప్రవర్తన ఆశ్చర్యాన్నే కల్గించింది.

"నీ వెందుకు ఇక్కడికి రావల్సివచ్చిందో అన్న విషయం చెప్పకోటాని కేమంత ఘనమయిందిమటుకు కాకపోవచ్చు"—నిట్టూర్చా డతను.

అర్థవిహీనంగా నాస్వామి నేత్రాల్లోకి చూశాను. నిశ్చల, నిరీహ, నిరీష నేత్రాలు!

"నేను నిన్ను నువ్వనుకునే విధంలో సంతోషం కలిగించా ననుకోటంమాత్రం పొరపాటుకావచ్చు"

"ఏమిటో చెప్పండి"

"ఇప్పుడు నాపరిస్థితి నీకు కొంచెం చెప్పడం అవసరం. నే నో బీదవిద్యార్థిని. మాఅమ్మ..." అతను ఆగిపోయాడు. గాఢవిషాదాచ్ఛాదితమైన అతని మొహం లో శోకపూరితస్వరూపం ఓనిమిషం నృత్యం చేసింది.

"అదంతా అనవసరం ప్రస్తుతం. నాకు డబ్బు కావాలి అవసరంగా"అన్నాడు.

నా స్వామి కోరితే చాలు ఆలోచించడంకూడా నా? వేటిని తృణప్రాయంగా చూసి నారాజును స్మరిస్తున్నానో, ఆ వినయశీలుడే వాటిని గౌరవించి, నన్ను తృణీకరిస్తున్నాడు!

నేను కారణం అడగదలచుకోలేదు. నాకు తెలియటం అనవసరం. అతనికి డబ్బు కావాలి. అంతే.

అల్మరా తీసి చూశాను. అప్పుడే పేరయ్యశెట్టి యిచ్చిన రెండు పచ్చకాకితాలు అగపడ్డాయి. మాట్లాడకుండా అతని జేబులో కుక్కాను.

"ఎందుకు ఇదంతా? నాకు యాభైరూపాయలు చాలు"అన్నాడు.

"తిరిగీ యిస్తే ఒట్టు"—గట్టిగా అతని చేతులు పట్టుకొని ప్రార్థించాను.

"నేను తిరిగీ వీటిని మీకు ఎప్పుడు ఇవ్వగలనో సరిగా చెప్పలేని స్థితిలో వున్నందుకు సిగ్గుపడుతున్నాను"

..................

"మీరు నన్నెరుగరు. నేను హోమీ యివ్వడానికి నాచదువుకునే పుస్తకా లున్నయి. అవయినా ఎవరో వాడుకోటానికి యిచ్చారు"

"నాకు మీ రేమీ చెప్పకుండావుంటే బాధ కలిగించకుండావున్నవా రవుతారు. మీదగ్గరినుంచి తిరిగీ తీసుకుంటా నన్నది కల్లోమాట. మిమ్మల్ని ఒక్క విషయం అర్థిస్తాను. మీకు సహాయం చేస్తూ బలవంతం చేస్తున్నా ననుకోబోకండి. అప్పుడప్పుడు నా కగపడుతుంటారుకదూ?"

"మీరు ఏ నమ్మకంమీద నాకిస్తున్నారో నాకు తెలీదు. కాని నేటికి జీవితంలో ఒక ఉత్తమోత్తమమైన జీవసాహచర్యం నాకు లభించినందుకు గర్విస్తున్నాను."

"ఈచీకటిలో ఎక్కడికి పోతారు? ఇక్కడ వుండరాదూ?" అన్నాను.

"నాకు పరీక్షరోజులు దగ్గరికొచ్చాయి, ఏవిధంగానూ ఇక్కడ వుండటానికి అవకాశం లేదు."

"వెళ్లి చదువుతారా?"

"అవును. మాఅమ్మ చాలా కష్టపడి చదవమని చెప్పింది. మాఅమ్మని—ఆ ప్రేమమూర్తిని - లోకాలంతా నివ్వెరపోయి చూసే త్యాగాన్ని చూసి చాలా సేపు శ్రమిస్తాను."

"మీకోసం అంత త్యాగం చేసిందా మీఅమ్మ"

"ఆమెత్యాగాన్ని నేను నా కందినంతవరకూ వూహించుకుంటున్నాను. ఆమె నాకే కాదు. దరిద్రనారాయణుల కఠోర ఆక్రందనాలకి ఒక మూర్తీభవించిన స్వరూపం...నేను ఆరాధించే దేవత ఆ మాతృమూర్తి."

"ఎప్పుడైనా జ్ఞాపకమొస్తే నానమస్కారాలు అందజేస్తారా?"

"ఆఁ, తప్పకుండా"_అతను ఆలోచించాడు.

"దయచేసి అందజెయ్యబోకండి. పొరపాటున అన్నాను. నేను మాతృమూర్తిని కాను. కాలేనేమో! వేశ్యనికదూ? పోనీ, ఎవ్వరికీ తెలియకుండా ఆరాధించుకోనీయండి" సూటిగా, అసహాయంగా చూశాడు. ఇద్దరం శూన్యంగా నిశీథంలోకి చూశాం. మా మధ్య అగాధాలు!

"శ్రమకల్గించినందుకు క్షమించండి. శెలవు."

"వస్తారుకదూ?" గద్గదస్వరంతో అర్థించాను.

"తప్పకుండా. తప్పించుకోలేను" తొందరగా తలవంచుకొని అతను వెళ్లిపోయాడు. నన్ను నిరాశలో ముంచి నిశీథంలోకి పోయాడు."

*    *    *

ఆ ముసలినర్సు ఈ ప్రపంచంలోకి వచ్చి, తలెత్తి రోగిని చూసింది! ఒకటే అశ్రుధారలు కారుస్తున్నాడు. ఎంత సేపట్నుంచి ఏడుస్తున్నాడో-కళ్లు ఎఱ్ఱబడ్డాయి. ఆమె మెల్లిగా తువ్వాలుతో అద్దింది.

"చెప్పు. దయచేసి. నా ఆనందానికి అంతరాయం కలిగించబోకు"

"ఎందుకు ఏడుస్తున్నావ్ ?"

................

"నీవంత జాలిగుండెగలవాడి వనుకోలేదు. పోనీ, మానేస్తాలే. మరి ఏడవబోకు"

"నేను ఏడవను" విశూ ఏమీభావం వెలిబుచ్చని స్వరంతో అన్నాడు.

"నాకు చెబుతుండు. నా కది చాలు. అంతకంటే ఈ ప్రపంచంలో నేను కోరేదిగాని, ఘనమైందిగాని లేదు. దయచేసి చెప్పవూ ?"

ఆమె అతనికి పాలు యిచ్చింది. విశూ నిరాకరించాడు.

"రోగం తిరగబెడుతుంది. నా మాట విను"

"నేను జీవించాలని నాకు ఆశలేదు"

"నువ్వింత విరాగివని అనుకోలేదు; అయినా బ్రతికున్నవారిలో చాలామంది జీవితసుఖం అనుభవిస్తామనిగాని, అనుభవించగలమనికాని బ్రతకటం లేదు."

"నేను పాలుత్రాగడం నీకు ఏమాత్రమైనా సుఖంకలిగిస్తే నేను ఎందుకు అభ్యంతరపెట్టాలో నాకు తెలియదు."

విశూ అయిష్టంగానే తన శరీరానికి మేలు చేకూర్చాడు. తనలాంటివారు అంతటా వున్నా రనుకొన్నాడు. "దయచేసి చెప్పండి. నేను వింటూనే చచ్చిపోవాలని అనుకుంటున్నాను. చెప్పరూ ?"

ఆమె చకిత అయింది. ఎవ రీదుఃఖభ'జనుడు? ఇత నెవరో తనకు తెలీదు. గత పాతికసంవత్సరాల నాటి మా జీవితగాథను ఎందుకు చెప్పాలో, అత నెందుకు అంత ఆత్రుత కనపరుస్తున్నాడో తనకు అయోమయంగా వుంది. కాని ఎవ్వరూ సానుభూతిని చూపని ఈ అభాగ్యునిలాంటి జీవితం ఎవ్వరికీ, ఎప్పుడూ ఆ నిర్ణేత ప్రసాదించవద్దనే ఆమె ప్రార్థించింది.

"బహుశః నన్ను గురించి నువ్వు విచారిస్తావు' నువ్వే కాదు. నా రాజుకూడా కరిగిపోయాడు."

మళ్లీ ఓ రోజు రాత్రి వచ్చాడు. పెరిగిపోయిన గడ్డం, కృశించిన దేహం...ఆ మలినవస్త్రాల్లో, నల్లమబ్బుల్లోని శశిలా వున్నాడు నా ప్రభువు. ఇలా అన్నాడు. "ఆ వేళ డబ్బివ్వకపోతే ఏ దురంతం తలపెట్టేవాడినో తెలీదు. అయినా అమ్మ నాకు సాయం చేయలేకపోయింది. ఈ సెలవల్లో మీ దగ్గర నన్ను గుమస్తాగానన్నా పెట్టుకోండి. నేను మీ అప్పు తీర్చంది ఎక్కడికీ పోదలచుకోలేదు."

అతన్ని చూస్తే విపరీతవిచారం వేసింది. మెల్లిగా మాటల్తో అతన్ని స్తిమితపరిచాను. భోజనం పెట్టి మంచి బట్ట లిచ్చాను. మెల్లిగా అన్నాను: "మీరు నాకు డబ్బివ్వకపోతే ఇక్కడ వుండరా?"

కొంచెం ఆలోచించి అన్నాడు: "వుండను."

నేను అతన్ని పోగొట్టదలచుకోలేదు.

"మిమ్మల్ని ఇక్కడ వుండమని కోరుతున్నాను' ఎలా భావించుకున్నా ఇబ్బంది లేదు."

అతను అంగీకరించాడు. అతనున్న ఆ రెండు నెలల్లో పరపురుషుణ్ని నా గుమ్మం తొక్కనీలేదు. చాలామందికి నాకు పెళ్లయిందని చెప్పాను. చాలామంది ఎన్నివిధాలుగా అనుకున్నారో, అనుకుంటారో నే నిప్పుడు చెప్పటం అనవసరం. అప్రస్తుతం.

కాని అమ్మా, నాన్నా ఈ విషయంలో నాకు కలిగించిన వత్తిడి ఏ మాత్రం గౌరవం వున్న వ్యక్తిగాని సహించరానిది. ఆతన్ని చూసుకునే అన్నిటికీ అంగీకరించాను. నేను మీకు అనుపడాలంటే నా యిష్టానికి వ్యతిరేకు లవకండని మందలించాను. వాళ్లు తమాయించుకున్నారు. ఎప్పుడైనా నావెఱ్ఱి తగ్గి మొదటి స్థితిలోకి రాగలనని వారినమ్మకం. నన్ను వదలిపెడితే వారికి జీవనాధారం లేదు.

అతని స్నేహితుడు--మాయింటికి అప్పుడప్పుడు వస్తుండేవాడు—శంకర్. అతను నన్ను కాళ్లా వేళ్లా పడి అర్థించాడు. తన సాహచర్యాన్ని విరమింపజేయవద్దనీ, తను ఆగర్భశ్రీమంతుణ్ణనీ, నన్ను మహారాణిని చేస్తాననీ చాలా ఆశలు గొల్పాడు. అతని మాటలు

వింటుంటే అతనిమీదుండే అసహ్యం ద్విగుణీకృత మైంది.

శంకర్‌కు, నాకు సంబంధం విడిపోయినతర్వాత అతను మానాన్నతో ఏవో మంతనాలు చేయటం మొదలుపెట్టాడు."

విశూ అడిగాడు. "మీరు ప్రేమించిన వ్యక్తి పేరేమిటో చెబుతారూ ?"

ఆమె పెద్దగా నవ్వింది. "నే నెప్పుడూ అతని పేరడగలేదు. నాకు అతని పేరుతో అవసరం ఎప్పుడూ కనిపించలేదు. నాదగ్గరికి ఇదివరకు ఎంతోమంది వచ్చేవారు. వారు నాపేరునుగురించిగాని, నేను వారిపేరును గురించిగాని ఎప్పుడూ ప్రస్తావించుకోలేదు. నాకు తెలిసినంతవరకు శంకర్ "రావు" అంటుండేవాడు. శంకర్ అతనితో ఇదివరకున్నంటే ఎంతో అన్యోన్యంగా పూసుకుతిరుగుతుంటే నేను భయపడ్డాను. ఓవిధంగా రావు అమాయకుడు. నామీద ప్రతీకారంతో అతనిలో ఏ విషభావాలు ప్రవేశపెడతాడో అని శంకించేదాన్ని. కొద్దికాలంలోనే నాశంక నిజమయిందని రుజువయింది. రావు ఓరోజు చాలాకోపంగా నాదగ్గిరికి వచ్చాడు.

"చూడు. నే నిక్కడుండడం బాగుండ్లేదు. మా అమ్మ వ్రాసిన ఈజాబులు చూడు. వూరంతా నవ్వుకుంటున్నారట. ఆమెకు తలవంపుగా వుందట."

నేను తలవంచుకుని నిల్చున్నాను.

"శంకర్ నేనేమో నీకు అడ్డుతగుల్తున్నానని చెప్పాడు. ఎవర్నీ బాధపెట్టడం నావంతు కాదు."

మెల్లిగా ఎవ్వరో తలుపుతట్టారు.

శంకర్ వచ్చాడు. ఆసమయంలో అతనంటే నాకు మండిపోయింది.

"శంకర్, దయచేసి నువ్విక్కణ్ణుంచి వెళ్లు. నువ్వు నన్ను ఇంకెంతకాలం సాధిస్తావోచూస్తాను. నీచత్వంలో అధిగమించిపోయారు." ఇంతలోనే ప్రక్కగదినుంచీ ఇద్దరు వచ్చారు. అమ్మా, నాన్నా. "ఏమిటి ఎరిగున్న ఆ పెద్దమనిషిని అలా తూలనాడుతావ్ ? మాటా మంచీ ఏం అక్కర్లేదా ఏం ?" అంది అమ్మ.

"నువ్వు అడుక్కుతింటావంటే నే దిగులుపడను కాని మమ్మల్ని అడుక్కుతినేట్టు చేయబోకు" చురచురా 'రావు' వంక చూస్తూ "నువ్వే కారణం ఈ తుపానుకంతా !" అంటూ వెళ్లిపోయాడు. శంకర్ సగర్వంగా స్వగతంగా చాలా సంతోషించాడు.

"గుడ్డుటావును ఎన్నాళ్లు గోకినా ఒకటే... నీ వెట్టిగాని" అంటూ నిష్క్రమించి పోయింది అమ్మ.

శంకర్ మెల్లిగా అన్నాడు: "రావు, నేను నీకు నీతులు చెప్పడానికి రాలేదు. నువ్వుండే పరిస్థితిని బట్టి, నువ్వు మీ అమ్మగారికి నెరవేర్చాల్సిన బాధ్యతను, గౌరవాన్ని బట్టి నువ్విక్కడనుంచీ ఎంతత్వరగా విడుదలైతే అంత మంచిదని చెప్పటానికి వచ్చాను." రావు చేతనా చేతనాలన్నీ పోయినవాడిలా నుంచున్నాడు. "క్షమించమని అడుగుతూ ఓ విషయం చెబుతున్నాను. మీ అమ్మగారికి శరీరస్వస్థత లేదని కర్ణాకర్ణిగా వింటున్నాను. బహుశః నువ్విక్కణ్ణుంచి విడుదలవడానికి ఎటువంటి ఆటంకమూ వుండదు. ఎందుచేతంటే, నువ్వు డబ్బువిషయం విచారపడనవసరం లేదుకనుక. ఈ పర్సులో మూడువంద లున్నాయి. నీ యిష్టం" అంటూ పిల్లిలా వెళ్లిపోయినాడు. ఎంత ఆ ప్తమిత్రుడు...ఒకప్పుడు రావు అతిదీనంగా, పరీక్షరుసుంకోసం అర్థించినా చిల్లిగవ్వ ఇవ్వని నిర్భాగ్యుడు శంకర్ ! నన్ను వల్లో వేసుకోడానికి, అడ్డంకి తప్పించుకోడానికి మూడువందలు అనాయాచితంగా, సులభంగా ఇచ్చివేశాడు! రావుమనస్సులో లోకాలు తిరిగిపోయినయి. పిచ్చివాడిలా పరిగెత్తాడు. ఎక్కడికో!

"రావ్, ఎక్కడికి ? వుండు. నా మాట విను." అని ఆక్రందిస్తూ అరిచిన నా ఆర్తనాదానికి గదిలోని గోడలు ప్రతిధ్వనించాయి. పోయినాడు. "గుడ్డుటావు" అన్న అమ్మమాట అతన్ని వేటాడుతుంటుంది! "ఎక్కడికి పోయినాడు నా రావు? నా ఆశాజ్యోతి ఆరిపోయినట్లేనా ?" రెండురోజులు దిండులో తల దూర్చి కుమిలిపోయినాను. నా రావు రాడా ? నా రాజు లేడా ??

* * *

నేను నిశ్చయించుకున్నాను. కార్యసాధకుడు అయిందానికి విచారించడు. అతని దృష్టి ఎప్పుడూ భవిష్యత్తంతా కలయదిరుగుతుంది.

అప్రయత్నంగా గదిలో వ్రేలాడగట్టబడిన దివ్యరూపుడు వివేకానందుని చిత్తరువు చూశాను. ప్రపంచాన్ని శాసించే గంభీరత, సత్యదర్శను అతనిలో వుట్టిపడుతున్నాయి. ఎన్నోసార్లు ఆ దివ్యమూర్తి వంక చూశానుగాని ఎందుకో ఈసారి నాలో మహత్త

రమైన మార్పు తీసుకొచ్చాడు. ఆ మహనీయుడిలో ఎంత ప్రశాంతత!

తమ్ముణ్ణి లేపి ఆయన వూర్లో వున్నారో లేరో కనుక్కురమ్మని పంపాను. మాట్లాడలేని స్థితిలో వున్నాడనీ, తనతో ఏం మాట్లాడక, అర్థంకాని చూపులతో వింతగా చూశాడనీ చెప్పాడు.

గుండెల్లో తుపానులు చెలరేగాయి. శరవేగంతో డాక్టర్ని పిల్చుకొని వెళ్ళను ఆగదికి. మెల్లిగా లోపలికి వెళ్లి అతన్ని మృదువుగా స్పృశించాను.

"ఎందుకొచ్చావ్ శశీ?"

"ఇప్పుడు నన్నడక్కండి."

డాక్టరు అతనితో నన్ను మాట్లాడకద్దని సంజ్ఞ చేసి, జాగ్రత్తగా పరీక్షించి, చేయవలసిన సదుపాయాలన్నీ చెప్పి మందిచ్చి వెళ్ళిపోయాడు.

వారంరోజులైంతర్వాత మామూలుస్థితిలోకి రాగలిగాడు. ఓరోజున అడిగాడు "డాక్టరుకి డబ్బు ఎవరిచ్చారు?"

"మిమ్మల్ని చూసి జాలిదలచి డబ్బు అడగలేదు" అన్నా ఏమంటాడోనని!

"నన్నుగూర్చి ఎవ్వరూ జాలిపడమని కోరను. నన్ను పరిహారంగా ఆయన అమ్ముకున్నా సంతోషిస్తాగాని" అతను కోపంతో అన్నాడు.

"మరేమీ అనుకోబోకండి. నా చంద్రహారాన్ని అమ్మాను." అతను అసహాయంగా, సిగ్గుతో తలవంచుకున్నాడు. బీదరికంలో వున్నందుకు ఎవరన్నా అవమానపడుతుంటే "రావు" మొదటివాడనే అంటాను. ఇద్దరం ఆగదిలోనే వుంటున్నామని చెప్పాలి. ఎవరన్నా ఒకరు ఆర్జించనిది కాలం వెళ్ళదు.

"మనం వుండటానికి డబ్బు లేదు. ఎలా జీవించడం?" అన్నాడు భోజనం చేస్తూ ఓరాత్రి. ఒక్కసారి మనస్సు ప్రకంపించింది.

"మీకు తెలుసు నేనిదివరకు ఎలా సంపాయిస్తున్నానో. మీ అభ్యంతరం లేకపోతే మనకోసం ఏమన్నా చేయడానికి సిద్ధపడుతున్నాను." రావు వణికిపోయాడు.

"నేను నిన్ను ఈ విషయంలో శాసించే స్థితిలో మాత్రం లేను. అయినా ఓహృదయపూర్వక సన్నిహితుడిగా, శ్రేయోభిలాషిగా ఒక్క విషయం ప్రార్థిస్తాను. మీరు ఆవృత్తి దయచేసి మానేయరూ?" అన్నాడు. గంభీరంగా అన్నాడు. "ఈ భాగ్యవంతులంతా పిరికి వాళ్లు. ఏమీ పని చేయకుండా, పని చేసి కృశించే అభాగ్యుల ధనాన్ని, అన్యాయమనన్నా లేకుండా హాయిగా అనుభవిస్తున్నారు."

నాస్వామికి మనస్సులో నానమస్సుల్ని అర్పించుకున్నాను. అప్పటినుంచి 'రావు' విధివిరామం లేకుండా ఉద్యోగంకోసం అన్వేషించడం మొదలుపెట్టాడు. కార్యసాధనకోసం ఎంత కష్టాన్నయినా లెఖ్ఖచెయ్యడు.

చాలావిచారంతో కూర్చున్న అతన్ని ఓరోజు అడిగాను: "మీకెక్కడా వుద్యోగం దొరకలేదా?" పెద్దగా నవ్వాడు.

"వుద్యోగం చెయ్యడానికి సమర్థతని, విజ్ఞానాన్ని చూస్తే ప్రపంచం ఇట్లా వుండదు."

"ఏమయింది?"

"నాసర్టిఫికెట్లని, యోగ్యతాపత్రాలన్నిటిని సరిగా ఎవ్వరూ చూడలేదు. నేనో అనామకుణ్ణి నన్ను చూడ్డానికికూడా ఎవ్వరూ రమ్మనలేదు. భాగ్యవంతుడు సాటివాడికే ఎప్పుడూ ఇచ్చుకుంటాడు. రానురాను వాళ్ళు ధనవంతులయి ఈ ప్రపంచాన్ని ఓ మధురకలగా భావించుతారు. మనం ఇలా కృంగిపోవలసిందేనా క్రమక్రమేణ?"

"పోనీ, మీ కభ్యంతరం లేకపోతే నేను..." దుఃఖంతో మాట్లాడలేకపోయినాను. మృదువుగా ఆ పొడుగాటి వేళ్లతో నా కురుల్ని సరిదిద్దాడు. "నేను ఆత్మాభిమానంవిషయంలో బీదవాణ్ణికాదు. జ్ఞాపకముంచుకో. ప్రపంచం తాత్కాలికంగా దుష్టుల్ని గౌరవించినట్లగపడొచ్చు. సత్యాదర్శంకోసం ఎదురీదు తాను ఏమైనాగాని దొంగ పట్టుబడనంతకాలం ఆపని అభినందించవలసింది కాదేమో!"

"దొంగతనం చేయడానికి ముఖ్యకారణమేమిటి మన దేశంలో?"

"అవును. ఉచితానుచితాలకీ, మంచి చెడ్డలకీ చాలా భేదం వుంది"

"నేను వుండబట్టి మీపరపతి చాలా చెడిపోయింది. నేను వదలిపెట్టడం నాకు ఏం కలిగిస్తుందో నాకు వదలిపెట్టండి. మీకన్నా జీవితం సాఫీగా నడుస్తుందని."

"వద్దు శశీ. ఎక్కడికన్నా మన్నెరుగని చోటికి లేచిపోదాం" నన్ను దగ్గరికి తీసుకొని గుండెలకి గట్టిగా అదుముకున్నాడు. అస్పష్టస్వరంతో— "ఒక కొరత జీవితంలో శాశ్వతంగా తీరిందని భావిస్తాను" అన్నాడు. ఒక్క క్షణం బాధల్ని, సాంఘిక గౌరవాన్ని, ప్రపంచాన్నీ మరిచాం. కష్టాలు కానని లోకంలో స్వేచ్ఛావిహంగాలం మేం. కడుపులో ఆకలి బాధిస్తున్నా—నాకు బాగా జ్ఞాపకం—మేం ఆ పరవశత్వంలో కరిగిపోయినాం.

ఎంత సేపయిందో తెలీదు. ఎవరో గట్టిగా అతని పేరు పిలుస్తూ తలుపు తట్టుతుంటే నేను మెల్లిగా లేచాను.

రావు ఆ స్వరాన్ని పోల్చుకున్నాడు. అతని ముఖం పాలిపోయింది.

అతను తలుపు తీశాడు. శంకర్ మొదట వచ్చాడు. తర్వాత మెల్లిగా శశి అమ్మా, నాన్నా. తర్వాత ఓ పెద్దమనిషి. అందరికంటే చివర ఓ శోకమూర్తి—రావు తల్లి వచ్చారు.

రావు వినయంగా అందరికీ నమస్కరించాడు. అమ్మపాదాల్ని స్పృశిస్తే ఆ తల్లి ప్రేమ పొంగిపోయింది. తన కొడుకుని, తన రక్తాన్ని గట్టిగా కౌగలించుకొంది. ఎన్నాళ్లయిందో చూసి! ఇద్దరూ చాలాసేపు అశ్రుధారలు కారుస్తూ అలాగే వుండిపోయారు. శంకర్ చూపుల్లో విషముంది. కాని, ఆస్నిగ్ధమాతృమూర్తి అశ్రుధారల్లో కరిగిపోయినాడు.

మీరంతా ఇలా పనిగట్టుకొని రావడమేమిటి? శంకర్ అన్నాడు—"నే నిక్కడకు వచ్చి మిమ్మల్ని భంగపరిచినందుకు క్షమించండి. వీళ్ళకు దోవచూపడానికి మాత్రమే వచ్చాను. నమస్తే." అతను వెళ్ళిపోయాడు. పిల్లిలా పారిపోయాడు.

నే నీ ప్రతిఘటించే సముద్రాలని ఎదుర్కొనే స్థితిలో లేను. నామాట వారు నమ్మరు! మా నాన్న అన్నాడు— "నువ్వు మాకేగాక ఒక తల్లిని, కొడుకుని వేరుచెయ్యడంలో ప్రముఖపాత్ర వహిస్తున్నావ్?"

అమ్మ అంది: "నీ కిక్కడ వుండటానికి ఒక్క క్షణమన్నా స్థానం లేదు. నీ అభివృద్ధిని నువ్వు నిరోధించుకోవటం చూస్తూ ఎన్నాళ్ళు వూరుకోగలం!"

ఆ వచ్చిన పెద్ద మనిషి అన్నాడు: "అమ్మాయీ, నువ్వెవరివో నాకు తెలియదు. కాని ఓవిధంగా కల్పించుకున్నందుకు ఏమీ అనుకోబోకు. మీరు ప్రేమంటే ఏమో తెలియని అజ్ఞానవయస్సులో వున్నారు"

రావు తలెత్తాడు ఏదో చెబుదామని.

"అమ్మా, నిన్నుగురించి మాకందరికీ విచారంగా వుంది. నువ్వు ఎవ్వరి సాహచర్యం చేస్తున్నావో, అందులో ఎటువంటి పరిస్థితుల్లో మా అబ్బాయితో స్నేహం నెరిపావో అదిమాత్రం ఎన్నటికీ సిద్ధించరాదనే మీ ఉభయుల శ్రేయస్సుకోరి చెబుతున్నాను."

నేను ఈ ములుకులవంటి మాటల ధాటికి తాళుకోలేకపోయినాను. రావుజీవితం నా సాహచర్యంవల్ల ఏమీ బాగుపడే అవకాశం నాకు గోచరించలేదు. ఎందు కింతమందికి అసంతృప్తి? అందరికీ తిరిగి నమస్కరించి, రావువంక "క్షమించమన్నట్లు" చూసి వెళ్ళిపోయాను. నేను వస్తే చాలనుకున్న అమ్మా, నాన్నా వెంటనే నన్ను బండిలో తీసుకెళ్ళారు. కాని రావు ఎలా వున్నాడనుకున్నావ్? దీనాతిదీనమైన, ప్రాధేయ పూర్వకమైన చూపు చూశాడు. గొంతు సవరించుకొని ఏదో చెప్పబోయాడు. కాని ఏం మాట్లాడలేకపోవటం ప్రత్యక్షంగా చూశాను.

"అమ్మా" అంటూ కూలబడిపోయినాడు.

తర్వాత నాకు తెలిసింది" ఆమె ఆగింది అతన్ని చూస్తూ. విశూ అతిప్రయత్నంమీద తేరుకున్నాడు. ఘోరంగా దగ్గుతూ తొట్టిలో వుమ్మేశాడు. దాంతో పాటు చాలారక్తంకూడా పడింది. ఆమె చాలా భయపడింది.

"డాక్టర్, డాక్టర్" అంటూ వెళ్ళే ఆమెను బలవంతగా ఆపాడు. "నేను కొన్నిగంటలు జీవించాలంటే డాక్టర్ని పిలవద్దు. వాళ్ళెవ్వరేం చెయ్యలేరు! కనీసం నాప్రక్కని కూచొని అతని జీవితగాథని చెప్పు. నీ శ్రమకు నేనేం ఋణం తీర్చుకోగలను కనుక!"

"ఎందుకు అంత ఆత్రుత అతని గతించిన జీవితం మీద?"

"నా జీవితచరిత్ర అడుగబోకు. ఓ విధంగా మా ఇద్దరి జీవితాలూ ఒకటే. అందుకే అంత ఆత్రుత" అన్నాడు విశూ.

"అవును. చాలామంది జీవితాలు విచిత్రంగా ఏకీభవిస్తుంటాయ్."

అతను కన్నుల నీరు నించుకున్నాడు. గత జీవితచరిత్ర ఆ కన్నీటిలో అతను చూశాడు!

"విను. అతనిపై నాకు మమకారం పోదు. రోజూ మా వీధిని పోతుంటే చూసి సంతోషించేదాన్ని. తమ్ముణ్ణి అతని యోగక్షేమాలు కనుక్కురమ్మని ఎప్పుడూ పంపుతుండేదాన్ని.

తల్లి అతనికి నీతినిగురించి, సాంఘికమర్యాదను గురించి చాలా చెప్పిందట. ఆ వచ్చిన పెద్దమనిషి చాలా శ్రీమంతుడట. జాలితలచి చదువు పూర్తయేవరకూ పూరికే సాయం చేస్తానన్నాడట. ఇది ఒకవిధంగా నిజంగా జరిగిందనే చెప్పవచ్చు కొంతకాలం.

ఎందుకంటే, రావు నిజంగా మారిపోయాడు. దుస్తులు, అన్నీ మారిపోయాయి. ఆ అమాయికముఖ లావణ్యం ఏం చీకట్లో దాచాడో! తమ్ముడు అగుపడినప్పుడల్లా డబ్బు యిచ్చేవాడు.

ఓ రోజు తమ్ముడు చెప్పాడు: "అక్కాయ్, నీ కిదిగో డబ్బు ఇవ్వాలిట. ఇదిగో ఆయనిచ్చిన పర్సు" అని యిచ్చాడు.

నాకు ఆశ్చర్యం కలిగింది. నన్నవమానపరచడానికేగా ఇది ఇవ్వటం! ఆ డబ్బును కోపంతో అవతల పారేశాను.

ఇంకోరోజు వాడు ఆత్రుతగా వచ్చి అన్నాడు: "ఏం చెప్పను అక్కయ్యా! ఆయన ఎలా తాగుతున్నా డనుకున్నావ్! నేను వెళ్లితే నాకు యివ్వటానికి వచ్చాడు. 'ఎంతో ఆనంద మిస్తుందట' అంటా రాయన. గదిలో శంకర్, ఆయన, ఇద్దరు రూపవతులైన స్త్రీలు... ఏం చెప్పను?" అన్నాడు.

నేను నమ్మలేదు. ఇలా మారిపోతాడని నే నెన్నడూ అనుకోలేదు. నా సాహచర్యం నశించినందుకు ఉన్నతస్థితిలోకి వస్తా డనుకున్నాగాని ఇలా వినాశకరమైన పంథా ననుసరిస్తా డనుకోలేదు. ఆ రాత్రే బయలుదేరి అతని బసకు పోదలచుకున్నాను, ప్రచ్ఛన్నంగా. క్రిందికి పోయినప్పుడు శంకర్, నాన్నా మాట్లాడుతున్నారు.

శంకర్ అంటున్నాడు: "పిచ్చిపిల్ల! సన్యాసీ సన్యాసీ రాసుకుంటే బూడిద రాల కేం చేస్తుంది?"

నాన్న అన్నాడు: "ఇదిగో, శంకర్ నీ కోసం వచ్చారు."

ఆ కోపంలో మాట్లాడలేకపోయినాను.

"నువ్వు పిచ్చిదానవని బుజువుచేస్తాను. ఎందుకంటే ఒక త్రాగుబోతుని, ఓ వ్యభిచారిని అత్యంత ఘనునిగా ఎంచి వలిచావు. అలాంటప్పుడు నే నెందుకు అతనికంటే తీసిపోయానో అర్థంకావటంలేదు."

నేను రివ్వున వెళ్లిపోయాను. నన్ను అతను అనుసరిస్తాడనే పరిజ్ఞానం లేకుండా.

"రావూ" గదితలుపు తోసి లోపలికి వెళ్లాను.

గది అంతా పరిమళద్రవ్యాల్తో నిండివుంది. బాగా తాగాడేమో - సరిగా గుర్తుపట్టే పరిజ్ఞానం పోయిం దతనికి.

"రావూ, ఇటూ చూడు" అన్నా.

"ఎవరూ?" అన్నాడు.

"నేను" అన్నా ముసుగు తీసి.

"ఎందుకొచ్చావ్?" అన్నాడు.

అలాంటప్పుడు ఏం చెప్పను?

"చూడు. మీ అమ్మగారికి, పోషించే ఆ దాతకి ఎంత అన్యాయం చేస్తున్నావో!" అన్నాను.

"న్యాయాన్యాయాల సంగతి నా కనవసరం. నీ కిక్కడ స్థానంలేదని తేల్చబడిందికదూ? పోరాదూ? నీకైనా మంచిది" అన్నాడు.

అతని కెంత చెప్పినా అర్థంకా దిప్పుడనుకొని వచ్చేస్తుంటే శంకర్ యమభటుడిలా తారసిల్లాడు.

"నేను నిన్ను గమనిస్తున్నాను. నేను నిన్ను, రావుని నాశనంచెయ్యగలను. ఈ సంగతి అతనికి సాయంచేసే దాతకి చెబితే ఏమవుతుందో వూహించు" అన్నాడు.

"ఏం చేస్తావు?" అన్నా ప్రజ్వరిల్లుతూ.

"నామాట విను."

"ఏమిటీ, న స్నెన్నాళ్లు సాధించదలచుకొన్నావు?"

"నువ్వు సౌందర్యదేవతవి. అసలు నాకోసమే పుట్టావని నానమ్మకం. చూడు, మన స్నేహాన్ని ఎందుకు బూడిదపాలు చేస్తావు?" అంటూ దగ్గిరికి రాబోయాడు.

"ఛీ, నీచుడా! నిన్ను దేనితో పోల్చాలో తెలీదు. నే నెవరిననుకుంటున్నావ్. స్త్రీ శక్తిస్వరూపిణి! దగ్గిరికి వచ్చావంటే నిన్ను చీల్చేస్తాను. నీతో నేస్తంకంటే కుక్కతో నయం" గట్టిగా గర్జించాను.

"నువ్వెన్ని చెప్పినా వినపడవు నాకు. నీస్వరమే నాకు సంగీతం" నామీద పడ్డాడు. బలవంతంగా పెనుగులాడి, పెద్దగా అరిచాను. దూరాన్న ఎవర్నో చూసి "చూడు నాతడాఖా చూపిస్తా" అంటూ ఆ నిశీథంలో కలిసిపోయాడు.

శంకర్‌ది పాముపగ. తనకు లాభం లేకపోయినా ఒకళ్ళు నష్టపడితే సంతృప్తిపడే తరగతికి చెందినవాడు.

రావు జీవితానికి శాశ్వతవినాశం చేకూర్చాడు. ఆపోషించే పెద్దమనిషికి ఏ కల్ల.బొల్లివిషయాలు వ్రాశాడోకాని ఆయన సాయంచెయ్యటం మానేశాడు. పరీక్షలు దగ్గరికికూడా వచ్చాయి.

అదే చివ్వరిసారి అతన్ని చూడటానికి వెళ్ళటం. పుస్తకాలు, గుడ్డలు, అన్నీ చిందరవందరగా పడిపోయినయి. తుపాను చెలరేగినట్లుంది గదిలో. గదిలో రెండు జాబులు వున్నయి. చూశాను తడిసిన ఆ లేఖల్ని!

ఒకటి: సాయం చెయ్యడంవల్ల ధనాన్ని దుర్వినియోగంచేస్తున్నట్లు తను భావించడంవల్ల విరమించడమైందని ఆ దాత వ్రాశాడు. రెండోది అన్నిటికన్నా ఘోరమయింది. ఒక ప్రచ్ఛన్నుడని సంతకంవుంది. అందుట్లో ఎఱ్ఱసిరాతో వ్రాయబడిన వాక్యాలు ఘోరాతిఘోరమయినవి. "మీ కీవిషయం చెప్పడానికి చాలా చాలా ఆలోచించాను. విచారపడుతున్నానుకూడా. ఎందుకంటే వ్యభిచారార్జితమైన విత్తానికి మీరు విలువనివ్వరని నాకు తెలుసు. మీకు సాయంచేసిన పెద్దమనిషి వ్యభిచారనీ, మోసకాడనీ తెలియకపోవడం చాలా దురదృష్టం. ఆయన మీకే ఎందుకు డబ్బు పంపుతున్నాడో ఆలోచించారా? సంగతేమంటే - మీ అమ్మగారికీ, ఆయనకీ సంబంధం వున్నదని చాలా పుకారుగా వుంది. మీకు ప్రత్యక్షంగా ఈవిషయాన్ని ఋజువుపరచడాకి తగిన ఆధారాల్ని సేకరించాను. ఇంతకంటే ఎక్కువ చెప్పడం అనవసరం."

ఎవరీద్రోహి? ఏ మనుకుంటాడు రావ్? దస్తూరీని పరిశీలించి చూశాను. శంకర్! అవును, శంకరే వ్రాసేడు. గుండె పగిలి చచ్చిపోలేదుకదా నారాజు?" అని చుట్టూరా కలయజూశాను.

ఇంటికి పోయేటప్పటికి తమ్ముడు ఎదురొచ్చాడు. నాలో ఒక్కొక్కసారి ఉద్రేకం పొంగిపోయింది. వాడితో చెప్పాను. శంకర్ చేసిన...గట్టిగా అనుమానమున్న ఈ అవినీతి—నీచాతినీచమైన కార్యాన్ని.

శంకర్ ద్రోహి. అతని కంట్లో విషం వుంది. శిక్షాస్మృతిలో ఇతనికి శిక్ష వుంటుందా?

"శంకర్ వారంరోజుల్నించి నా కనుపళ్లేదు. ఒకసారి రావుగారే చెప్పారు వూరికెళ్ళాడని" అన్నాడు.

విధిలేక వాడూ, నేనూ ఈమహాపట్నంలోని వీధివీధిని, వాడవాడని తిరిగాం రావుకోసం! ఎక్కడా జాడలేదు.

అతను నమ్మివుంటాడు? అందుట్లో ప్రపంచంలోని మాయలు వూహించని అమాయకస్థితిలోనే వున్నాడతను.

అవును. ఆమెకు భర్త లేడు! హిందూవితంతువు! కామవాంఛాపరుడైన పురుషుడు! వూరికే సాయం చెయ్యడం! ఈర్ష్యవున్న ప్రతివాడూ లోపాల్ని కనిపెట్టే విషమసమయం!

*    *    *    *    *

నేను దుఃఖాంబుధిలో మునిగిపోయినాను. తిరిగీ ఈ మానవప్రపంచంలో నేను విహరిస్తాననుకోలేదు. కాని ఒక్కటే ప్రతీకారంకోసమే జీవించివున్నాను. శంకర్! అత నగుపడితే పొడిచి పొడిచి, చీల్చి చీల్చి చంపేస్తాను! ఒక జీవితాన్ని నిర్దయగా నలిపివేశాడు. రావు పరీక్షల సమయంలో జరిగిందీ విషాద ఘటన! అమ్మా, నాన్నల బలవంతంమీద నాలుగు మెతుకులు తినడం! ఓవిధంగా నామమాత్రంగానే జీవిస్తున్నాను.

పదేళ్ళు నెమ్మదిగా దొర్లాయి. మళ్ళీ ఎప్పుడన్నా శంకర్ నాదగ్గరికి వస్తాడనుకున్నానా?

ఓనాడు హఠాత్తుగా శంకర్ సరాసరి నాగదిలోకి వచ్చి కాళ్ళుపట్టుకొని వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టాడు. నేను మొదట అతన్ని గుర్తించలేదు. ఆ పెరిగిన గడ్డం! అంతా విరక్తిజెందినవాడిలా వున్నాడు.

"ఎవరూ! శంకర్" అన్నాను లేస్తూ.

చాలాసేపు విలపిస్తూ అతను మాట్లాడలేక పోయాడు.

"నన్ను క్షమించమని అడగను. నువ్వు విధించబోయే శిక్షను విని, అనుభవించడానికి వచ్చా" నన్నాడు.

నేను మాట్లాడలేదు.

"నాకు నిజంగా రావు శిక్షవిధించవలసినవాడు. కాని అతన్నిగురించి నా కేమీ తెలీదు." అన్నాడు.

నే నాస్థితిలో అతన్ని నిందించదలచుకోలేదు. అసలే నడుంవిరిగిన పాము! "నీకతన్ని గురించి తెలిస్తే ఏమన్నా చెప్పు. ఎల్లాగయినా రక్షిద్దాం"

"నేను రెండు సంవత్సరాలు అతన్ని జాడతీసే ప్రయత్నంలో తిరిగాను"

"ఎక్కడున్నావ్ ఇన్నాళ్ళూ?"

"రెండేళ్ళు ప్రచ్ఛన్నంగా దాక్కున్నాను. నామీద ఫోర్జరీనేరం వస్తుందేమోననుకుని. అలాంటి దేమీ అగుపళ్ళేదు. తర్వాత నాగుండెల్లో ఏదో బరువుగా బాధించడం మొదలుపెట్టింది. నేను చేసిన ఘోరాన్ని గూర్చి ఆలోచించుకున్నాను. రావుని వెతకాలి. అతన్ని వెదికి నాసొంతసోదరునిగా చూసుకొని ఆ తల్లికొడుకుల జీవితాలకి ఆత్మశాంతి చేకూర్చాలి. నా ఆస్తి అంతా అన్నా విసర్జించదలచుకున్నా సంతోషంగా. కాని రావుజాడ తెలీలేదు. అతనికి పిచ్చెక్కిందని కర్ణాకర్ణిగా అన్నారు. హిమాలయాలకు పోయాడని అంటే అక్కడికి పోయాను. ప్రభుత్వం మీద విప్లవంజరిపే యువకవీరులతో తిరుగుతున్నారన్నారు. అసలు జీవించాడా? నాకు నమ్మకంలేదు.

ఇద్దరం విషాదంగా చాలాసేపు మౌనముద్ర వహించాం. చివరికి ఆత నన్నాడు: "నాజీవితాన్ని ప్రజాసేవకోసం అంకితం చెయ్యదలచుకొన్నాను. అందుకే ఆనాడే న్యాయవాదవృత్తికి తిలోదకాలిచ్చి బొంబాయి వైద్యకళాశాలలో చేరి పట్టభద్రుణ్ణయి వచ్చాను."

"నువ్విప్పుడు వైద్యుడివన్నమాట?"

"అవును. ఒకందుకు నువ్వీవిషయంలో సాయం చెయ్యాలి"

నేను మాట్లాడలేదు.

"నాఆస్తి సగం అమ్మదలిచాను. మనిద్దరి ఆత్మశాంతికోసం ధర్మవైద్యశాల నిర్మింపదలిచాను. రావు స్మారకభవనమని పేరుపెడదాం. మానవసేవతో అంతమవుదాం"

నేను బాగా ఆలోచించాను.

"ఇంతకంటే నేను ఏం చెయ్యాలో తోచడం లేదు. నాకు సమ్మతమే"

శంకర్ కళ్ళల్లో ఆనందజ్యోత్స్నలు వెల్లివిరిశాయి.

"రావు అమ్మ ఎక్కడుంది?" అన్నాడు.

"ఈవూళ్ళోనే పిచ్చిగా తిరుగుతుందని విన్నా"

"ఆమెను యావజ్జీవితం పోషించే భారం నామీద వుంది"

ఇద్దరం అంగీకరించి "ఆమెను" ప్రార్థించాం.

కాని ఆమెకు అర్థంకాదు. "నే నిలాగా వుంటాను. తింటాను. తిరుగుతాను. మా అబ్బాయి ఎక్కడున్నాడో వెతుక్కోవద్దూ" అంటుంది. ఎన్నిసార్లు చెప్పినా వినలేదు.

ఇద్దరం అప్పటినుంచీ ఈ వైద్యశాలని స్థాపించి పనిచేస్తున్నాం. నిన్న పరీక్షించాడే అతనే డాక్టర్ శంకర్.

ఆ మాతృమూర్తి రోజూ వచ్చి మమ్మల్ని వాడుకగా వాళ్ళబ్బాయినిగురించి అడుగుతుంటుంది. మాకు విసుగులేదు. మాకు విపరీతపరితాపం. నన్ను ఆప్యాయంగా "నర్సుకోడలు" అంటుంది. ఇష్టమైతే మేమిచ్చిన వేమన్నా తీసుకుంటుంది. లేకపోతే లేదు."

—ఆమె నెమ్మదిగా ముగించింది.

"అయిపోయిందికదూ?" రోగి విశూ ఘోరాతిఘోరంగా దగ్గాడు. రక్తం కక్కుకున్నాడు. అసహాయంగా ప్రక్కమీద వాలిపోయాడు.

"డాక్టర్, డాక్టర్" అంటూ ముల్లోకాలు ప్రతిధ్వనించేటట్లు అరుస్తూ పరిగెత్తింది.

ఆ ఆర్తనాదానికి వార్డులోని నర్సులు, డాక్టర్లూ ఆమెగదివైపు పరిగెత్తారు. అతని నాడి నీరసించిపోయింది. అందరికీ నమస్కరించాడు. ముసలిదాది ముఖంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు.

* * * *

ఆ పిచ్చిదానివెంట పిల్లలు అరుస్తూ పరుగెత్తుతున్నారు.

మామూలుగానే "నర్సు కోడలా!" అంటూ ఆమె ఆస్పత్రిఅంతా వెదికింది. నిశ్శబ్దంగా వున్న ఆ గదిలోకి శరవేగంతో వచ్చింది! కాళీదేవిలా ఆ నినాదం రోగి విశూచెవుల్లో ఎన్నడూ వూహించుకోనంత

మధురంగా వినబడింది! ఏదో మాట్లాడబోయినాడు గాని మృత్యుదేవత గొంతునొక్కుతుంటే ఏం చేస్తాడు?

డాక్టరుకి ఆ సమయంలో ఏమీ తోచలేదు. ఆమెవంక అయోమయంగా చూశాడు. అందుట్లో రోగి చావుబ్రతుకుల్లో వున్న సమయం కూడాను! దాది ఆమెను అనునయిస్తూ "ఇక్కడి కెందుకొచ్చావ్ ఇప్పుడు?" అంది. పిచ్చిది పెద్దగా అరిచింది. "మా అబ్బాయిసంగతి మీకు తెలుసు. మరి ఎవర్ని అడగమంటారూ?" అంటూ రోగిని ఎగాదిగా చూసింది! "అవును. మాట్లాడబోకు. ఇదిగో పడుకున్నవాడే మీ అబ్బాయి. సరేనా" అంది సమాధానపరచడానికి ప్రయత్నిస్తూ ఆ ముసలినర్సు! ఒక్కసారి, రోగి, తన గంభీర, విశాల, అందమైన, శాసించే నేత్రాల్ని తెరిచాడు. అతనికి మాట పడిపోయింది. కాని అతనికి ఎవ్వరూ అగుపడలేదు. తనని పరీక్షగాచూసే మాతృమూర్తితప్ప.

....................

ఎక్కడినించి వచ్చిందో మృత్యువును ముద్దుపెట్టుకొనే ఆ రోగికి ఆ శక్తి! ఒక్క వూపులో ఆ పిచ్చిదాని పాదద్వయంమీద చుట్టవేసుకున్నాడు. అతన్నెవ్వరూ ఆపలేదు. ఆపలేరుకూడా! అందరూ విభ్రాంతులై చూశారు వారివంక!

"అమ్మా! నన్ను తనివితీరా చూడు. మీ అబ్బాయిని. అమ్మా...అమ్మా...అమ్మా"లో కాలు మారుమోగేటట్లు ఆక్రందించాడు. అదే అతని ఆఖరి అరుపు. ఆయాసంతో, ఆత్రుతతో ఆమెపాదద్వయంమీద కట్టకడపటి ముద్దు నుంచాడు. అంతటితో ఆ పాదాలు అతని రక్తంతో కడగబడి అరుణకాంతులు దాల్చాయి.

దాది తేలిపోయే కళ్లతో ఆ దారుణదృశ్యాన్ని చూసింది.

మూర్ఛబోయిన దాదిని, అతిదారుణంగా మరణించిన విశూని చూసి అందరూ ఉద్వేగంతో కణికిపోయారు.

ఆ పిచ్చితల్లికి ఇదేమీ అర్థమైనట్లు మాత్రం అగుపించలేదు.

"మీరంతా నన్ను పిచ్చిదాన్ని చేస్తున్నారు. సూర్యబింబంలాంటి శరీరకాంతి. రంభైనా వరించే రూపలావణ్యం. కలువపూవుల్లాంటి కన్నులు!...ఇతనా మా అబ్బాయి?? నా కెప్పటికైనా అగుపడకపోడు. నన్ను గుర్తుపట్టకపోయినా నేను గుర్తుపట్టగలను! నా మాట తిరస్కరించడు మా అబ్బాయి" ఆమె వికటహాసం చేస్తూ పోయింది.

*   *   *   *

శంకర్, దాదులవిషయం నా కనవసరం. ఇప్పుడాపిచ్చితల్లి ఏమైందో నాకు తెలియదు. విశూజీవితాన్ని చూసి ఏడవాలో, నవ్వాలో నిర్ణయించలేను. కాని జీవించే, జీవించబోయే ఏ తల్లికిగాని, ఎటువంటి అపరాధానికైనా, అటువంటి జీవితాన్ని మాత్రం ప్రసాదించవద్దని-మనల్ని ఈ లోకంలో పాలించి, శాసించే శక్తి ఏదన్నా వుండివుంటే - ప్రార్థిస్తాను. ఆమె వాళ్లబ్బాయికోసం ఇంకా ఈ విశాలప్రపంచంలో ఏమూలో-తల్లిని ఏడిపించే అమాయకబాలుడిలా-దాక్కున్నాడేమోనని వెతుకుతుంటుంది! అందుకే ఆమె జీవించి దేన్నీ లెక్క చెయ్యకుండా పరితపిస్తుంది!

బహుశా ఎప్పుడైనా మీ దగ్గిరకొచ్చి "మా అబ్బాయిని చూశారా? కలువపూవుల్లాంటి కన్నులు..." అంటూ వర్ణిస్తుంది అనుకోండి. ఏం చెబుతారూ ఆ మాతృదేవికి?

